# పుస్తక పరిచయం




**Author**
102, Gaganmahal Apartments,
Domalguda, Hyderabad - 500 029.
Phone : 040-27636172
E-mail : drcbhavanidevi@gmail.com

**మాతృదేవోభవ,** పితృదేవోభవ, ఆచార్యదేవోభవ.. - ప్రతి వ్యక్తిజీవితంలోనూ ఈ ముగ్గురూ దేవుళ్ళే. ఎదిగే వయసులో, చదువు నేర్చే క్రమంలో ఒక్కోసారి మనల్ని దండించినా, అదంతా మన మంచికే అని తెలిసే వయసొచ్చిన వద్దనుంచీ అమ్మా, నాన్నా, మాస్టారూ మనకి కనిపించే దైవాలే. వాళ్ళలో ఎవరి గురించి మాట్లాడమని అడిగినా మన గొంతు ఆర్ద్రమౌతుంది, మనసు సముద్రమౌతుంది, జ్ఞాపకాలు ఒకదాని తర్వాత ఒకటి పెల్లుబుకుతాయి. లోగడ ఒక వారపత్రికలో నామిని సుబ్రహ్మణ్య నాయుడుగారు 'నాన్నకు జేజే' అనీ శీర్షికతో ప్రముఖుల నాన్నల గురించి వారితోనే చెప్పించారు. అవన్నీ మనసుల్ని కదిలించే కథనాలు వ్యాసాలు, స్వీయానుభవాలు. కౌముదిలో కూడా ప్రారంభంలో 'మాతృ దేవోభవ' అని, 'మా మంచి మస్టారు' అనీ ఫీచర్లు వచ్చాయి. వీటిల్లో అనేకమంది పాఠకులు తమ మాతృమూర్తుల్నీ, అధ్యాపకుల్నీ స్మరించుకున్నారు. అదే కోవలో ప్రఖ్యాత రచయిత్రి డా. చిల్లర భవానీదేవిగారు 'నది' మాసపత్రికలో 'తల్లీ నిన్ను తలంచి' అనే శీర్షికను నాలుగున్నర సంవత్సరాలపాటు నిర్వహించారు. దానికి టాగ్ లైన్ 'కన్నబిడ్డల గుండెచప్పుడు'. తెలుగువారికి చిరపరిచితమైన ప్రముఖులు 53 మంది తమ మాతృమూర్తుల జ్ఞాపకాలను పాఠకులతో పంచుకున్నారు. ఆ వ్యాససంకలనమే ఈ 'తల్లీ నిన్ను దలంచి' పుస్తకం. ఇందులో శాంతా బయోటెక్ వరప్రసాద రెడ్డిగారు, డా.ఎన్.గోపిగారు, దేవదాస్ కనకాలగారు, గొల్లపూడి మారుతిరావుగారు, భువనచంద్రగారు, ఓలేటి పార్వతీశంగారు.. మొదలైన ప్రముఖులు తమ మాతృమూర్తుల గురించి మనసులని కదిలించేలా వ్రాశారు. తమ బాల్యపు బంగారు జ్ఞాపకాలకు ఆత్మీయమైన అక్షరరూపమిచ్చారు. ప్రతివ్యాసానికి మొదట్లో ఆయా ప్రముఖుల సంక్షిప్త పరిచయం కూడా అర్థవంతంగా ఉంది. ఒక్కోవ్యాసం చదువుతుంటే వారితో కలిసి వాళ్ళ అమ్మగారిని పలకరిస్తున్నట్లుంది. ఒక్కో అమ్మదీ ఒక్కో కథ.. ఐనా అందరిలో ఉండే సామాన్యగుణం త్యాగం, ప్రేమ. అదే ప్రతివ్యాసంలోనూ ప్రతిబింబిస్తుంది. పుస్తకం పూర్తయేసరికి ఒక వూళ్ళో 53 ఇళ్ళకు వెళ్ళి - కృష్ణవేణిగారు, చంద్రావతమ్మగారు, శాంతకుమారిగారు, మాలతిగారు, సత్యవతమ్మగారు - ఇలా ఆయా మాతృమూర్తుల ఎదుట కూర్చున్నట్లు ఉంటుంది. రచయిత్రి భవానీదేవిగారు చేసిన అద్భుతమైన ప్రయోగం ఇది. ★★★




**Published by**
Aparajitha Publications
Flat 401, Block 3
MyHome Vihanga
Gachibowli
Hyderabad - 500032
INDIA

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**

డా.ఎ.ఎస్.రామశాస్త్రిగారు 'అనామకుడు' కలం పేరుతో తెలుగు పాఠకులకు చిరపరిచితులే. దేశ, విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించి, 35 సంవత్సరాలపాటు రిజర్వ్‌బాంక్‌లో ఉన్నతోద్యోగిగా పనిచేసిన రామశర్మగారు ప్రస్తుతం హైదరాబాదులోని IRBT డైరెక్టర్ గా పనిచేస్తున్నారు. 'అనామకుడు' కలం పేరుతో అనేక కథలు, నవలికలు, శ్రవ్యనాటికలు రచించారు. ఉషశ్రీగారి జీవితకథను "ఇంతింతై వటుడింతై' అనే పేరుతో అక్షరీకరించారు. వారు వ్రాసిన ఈ అక్షరాంజలి పద్యసంపుటి ఒక వినూత్న ప్రయోగం. మొదటి అధ్యాయం అక్షరాంజలిలో ఈ పుస్తకం రచన వెనుకనున్న ఉద్దేశాని ఇలా చెప్పారు రచయిత "అరవై సంవత్సరాలుగా ఈ సృష్టి నన్ను అనుక్షణం అబ్బురపరుస్తూనే ఉంది. ఆనందంలో ముంచెత్తుతూనే ఉంది.... (శాస్త్రవేత్తలు, శాస్త్ర విజ్ఞానం వింతగా తోస్తూనే ఉంది). సృష్టికర్త ప్రేరణతోనే సృష్టిలో నేను చూస్తున్న విశేషాలనీ, వింతలనీ సృష్టికర్తకు విన్నవించుకునే ప్రయత్నం మొదలుపెట్టాను. ఆ ప్రయత్న ఫలితమే అరవై పద్యాల అక్షరాంజలి.". ఇది చాలా చక్కటి ఆలోచన. ఈ సృష్టికంతటకీ ఏదో అతీతశక్తి కారణమని నమ్మేవారు, ఆ శక్తిని కీర్తిస్తూనో, ప్రార్థిస్తూనో పద్యాలు, శ్లోకాలు వ్రాయడం అనాదిగా వస్తున్న ప్రక్రియే. ఐనా ఈ రచయిత చేసిన ఈ నివేదనలో ఒక విలక్షణత ఉంది. సనాతన విజ్ఞానం, ఉపనిషత్తుల నుంచి ఆధునిక విజ్ఞానశాస్త్రంలోని అనేక శాఖలవరకూ వివిధ అంశాలను తాను చూసిన విధానాన్నీ, వాటిలోని సందేహాలనూ సృష్టికర్త ఎదుట ఆవిష్కరించుకునే ప్రయత్నమే ఈ పద్యపారిజాతాల కూర్పు. ఇందులోని అంశాలన్నింటినీ ఆత్మనివేదన, నీ వినోదం, మా సందేహం, నీ విలాసం, ఉపనిషత్తులు, సనాతన విజ్ఞానం, నా విన్నపం అనే అధ్యాయాలుగా విభజించి వ్రాశారు. పుస్తకం చివరలో ఈ పద్యాల్లోని కొన్నికొన్ని సైంటిఫిక్ పదాలకు, లోతైన భావాలకు ఆంగ్లంలో వివరణనిచ్చారు. పద్య రచన అత్యంత సరళంగా సాగింది. గంభీరసమాసాలతో నింపెయ్యకుండా అందరికీ అర్థమయ్యే రీతిలో, అందరినీ ఆసక్తిగా చదివించే శైలిలో సాగాయా పద్యాలన్నీ. పద్యరచనలో ఒక చక్కటి లయ గోచరిస్తుంది. చాలా పద్యాలలో కరుణశ్రీగారి పద్యరచనా పోకడలు స్ఫురిస్తాయి. ఉదాహరణకు: ఆత్మనివేదనలో " ఇచ్చితీవు భోజ్యములు - ఇచ్చితి నీకు నివేదనంబుగా / ఇచ్చితీవు పుష్పములు - ఇచ్చితి నీకు సుమమాలగా / ఇచ్చితీవు విద్యలను - ఇచ్చుచునుంటిని పద్యమట్లుగా / ఇచ్చిన నీకే ఇచ్చుటను - ఎంచక తప్పుగ స్వీకరించుమా!" 'ఇచ్చిన నీకే ఇచ్చుట' ఎంత చక్కని భావన..! మా సందేహంలో ఇలా అంటారు - "తారల మధ్యదూరము, పదార్థపు రీతులు, దేహభాగముల్ / తీరుల చూచి సత్యమును తెల్పగనెంచెడు ఊహ సవ్యమా? - మారుచునుండు లోకమొక మాయయె - సత్యము అంతరంగపున్ / దారుల యోగసాధనము ధ్యానము చేసిన కాని చిక్కదా?". ప్రతి పద్యంలోనూ లోతైన భావాలున్నాయి, వాటికి అందమైన పద్యరూపమిచ్చిన 'అనామకుడు' గారి కృషిని అభినందించాలి. ఈ చిరుపుస్తకం అమ్మకానికి కాదు. ఉచితంగా ఇక్కడ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. asramasastri.com/books/aksharanjali.pdf ★★★